పూర్వాపరాలు

[కథానిక]

శ్రీ కొమరగిరి నరసింహారావు

అందరిలాగానే అతనికీ చిన్నతనంలో పెండ్లి అంటే ఏమిటో తెలిసేది కాదు. పెండ్లయితే తనకు భార్య వస్తుందనీ, తన తల్లిదండ్రులకు కోడలు వస్తుందనీ మాత్రమే తెలుసు. అంతకు మించి దానిలో ఉండే ఆంతర్యమేమిటో అతనికి స్ఫురించేది కాదు. దాన్ని గురించి ఆలోచించి అర్థంచేసుకునే పరిపక్వత యింకా అతని మనస్సులో ఏర్పడలేదు. అలాంటి చిన్నతనం నుంచే అతనికి పెండ్లిరాయబారాలు ప్రారంభమైనాయి. అతని అభిప్రాయాన్ని అడిగినప్పుడు పైకి 'యిప్పుడక్కర లే'దని చెప్పినా లోలోపల ఎంతో ఉత్సాహపడుతూనే ఉండేవాడు. ఏభావాన్నైనా మనసులోనే అణచుకుని పైకి గంభీరంగా కనిపించే గుణం అతనికి నైజంగానే అబ్బింది.

అప్పటినుంచే మనసులో ఎన్నో కలలు కనేవాడు. ఎన్నో చిత్రాలు చిత్రించుకొనేవాడు. ఎన్నో రూపులను కాంచగలిగేవాడు. ఎన్నో మనోహర స్త్రీ మూర్తులను భావవీథిలో దర్శించి యింట్లో తన సమక్షంలో నేత్రపర్వంగా చరిస్తూన్నట్లు భావించుకుని సంతోషపరవశు డయ్యేవాడు. తన ప్రణయమూర్తి మన్మథతాపపీడనచే వివశయైపోయే విరహిణి ప్రబంధ నాయిక కాదు. తెలియని యేలోకంనుంచో ప్రత్యక్షమయ్యే నిర్గుణ దివ్యమోహన తేజోమూర్తిమాత్రమే. ఆమూర్తి ఎక్కడ ఉందో అతనికి తెలియదు. కాని ఎక్కడో ఒకచోట తప్పకుండా ఉండిఉంటుంది అనే నిశ్చయానికి రాగలిగేవాడు.

ఆ ఎంతకాలంగానో కలలు కంటూన్న ముహూర్తం సమీపించేసరికి అతను యౌవనపు తొలి వెలుగులో అడుగుపెట్టాడు. తాను సర్వస్వతంత్రుడు. వెనుకటి కాలంలోలాగా తల్లితండ్రులు చేసుకునే బొమ్మలపెండ్లిండ్లలోని ఒక బొమ్మలాగా ఉండటం అతను ఊహించనుగూడా ఊహించలేకపోయినాడు.

కాలం మారిపోయింది. ఆ కాలవేగంలో మనస్సులూ, ఆచారాలూ, మానవప్రకృతీ కూడా మారిపోతున్నాయి. అంతా నాయిష్టమే అనుకున్నాడు. అవును, అంతానీయిష్టమే నన్నారు తలిదండ్రులు.

వధువును చూచాడు. నచ్చింది.

"ఇంగ్లీషు అట్టే చదువుకోలే" దన్నారు.

"ఫరవాలేదులే" అనుకున్నాడు. "చదువూ, నాగరకతా ఉండగానే సరేనా, సంస్కృతి లేకపోయింతరువాత. ఇది ఉంటే అవిలేకపోయినా ఫరవాలేదు. తరువాత అవే వస్తాయి. సంస్కృతి సంప్రదాయసిద్ధంకనుక అది నైజంగానే ఉండిఉంటుందిలే" అని సమాధానపఱచుకున్నాడు.

"మరి సంగీతంగూడా రాదే?" అని మరో ప్రశ్న.

"ఓ, అదేముంది! కావాలనుకుంటే తరువాత చెప్పించుకోవచ్చులే" అని తృప్తిపడ్డాడు.

"కట్నమేమీ యివ్వరేమో?" అని మళ్లీ గొణిగారు.

"మనం కావాలనుకోటం లేదుగా?" అని జవాబు చెప్పుకున్నాడు.

"సరే, వాడి యిష్టం. వాడికి నచ్చితేసరి." అని సరిపెట్టుకున్నారు తల్లిదండ్రులు.

౨

కాలప్రవాహంలో ఎన్నో మార్పులు! ఒక శిల మీదినుంచి మరొక శిలమీదికి ఉన్మత్తవేగంతో పాకుతూ, దూకుతూ ప్రవహిస్తూ నిర్ఝరిగా నున్నప్పటి నదికీ, క్రమంగా సాగిపోయి విశాలమై గభీరమై సాగర ప్రియదర్శనాభిలాషతో నిండుచూలాలిలాగా ప్రశాంతంగా ప్రవహిస్తూన్నప్పటి నదికీ ఎంతో భేదముంది!

అతను యింకా యువకుడే. యౌవనపటిమ యేమాత్రమూ సడలలేదు. కాని యౌవన కషంతో దయంలోని సాగర శక్తిమలు యిప్పుడు కొంచెం కనుమాపుగా ఉన్నాయి. ఆ నిర్ఝరిలాటి ఉద్వేగం యిప్పుడు కనుపించదు. వయస్సులోని యీ మార్పుతో మనస్సులో క్రమంగా పాదుకుంటున్న స్థైర్యపు చాయలు యిప్పుడే కొంచెం స్ఫుటంగా గోచరిస్తున్నాయి. గతించిన కొద్దిజీవితకాలంలోనూ గడించిన అనుభవంతో యిప్పుడు కాస్త వెనుకా ముందూ చూడగలిగిన దృష్టిని సంపాదించుకున్నాడు.

తన ఆశలూ, ఆశయాలూ కేవలం నిష్ఫలం కాకపోయినా రానురానూ యిలా పరిణమిస్తాయని అతను ఎన్నడూ అనుకోలేదు. ప్రతిమానవుడి జీవితంలోనూ యిలాగే జరుగుతూంటుందా అనే సందేహం యిప్పుడు ఒక్కొక్కమాటు అతనికి కలుగుతూంటుంది. జరుగుతూంటుందేమో అనికూడా అనుకుంటాడు. అయినా తానూ సామాన్యమానవమాత్రుడేనా? వారికీ, తనకూ ఏమీ భేదంలేదూ? కవి అనీ, చిత్రకారుడనీ, నటుడనీ, కళోపాసకుడనీ యింకా ఏమేమో అనీ చాలామంది తననుగురించి అనుకోడం లేదూ? అందుకు ఎంతమందో తనను అభినందించటం లేదూ? తనతో పరిచయం చేసుకోవాలనీ, స్నేహం చెయ్యాలనీ ఎంతమందో అభిలషిస్తూంటారే. మరి యిలాంటి తనకూ, ఆమెకూ ఎందుకంత సామరస్యం కుదరటం లేదు? ...

అది అతనికో పెద్ద సమస్య.

ఆసమస్య ఒక్కొక్కమాటు ఎంతో తేలిగ్గా విడిపోతుంది. మళ్లీ అంతలో ముడిపడి అభేద్యమైపోతుంది. అప్పుడు తర్కంలోకి దిగుతాడు. పూర్వాపరాలు పరిశీలిస్తాడు. పోనీ, తనలో ఏమున్నా తప్పుందా? తన తప్పు తాను తెలుసుకోవటం ప్రపంచంలో ఎంతో కష్టమైన కార్యం అని అతనికి తెలుసు. అయినా మహనీయుల జీవితచరిత్రలలోని కొన్ని ఘట్టాలతని కప్పుడప్పుడూ జ్ఞాపకం వస్తూవుంటాయి. అవి చిరస్మరణీయాలు. తత్ఫలితంగా అతనికీ గుణం కొంత అబ్బింది. అతను కేవలం తనలోపాలను తాను తెలుసుకోనలేని గురిగింజ కాడు. అత్యంతసునిశితంగా ఆత్మపరీక్ష చేసుకున్నాడు. తనలో తప్పేమీ కనుపించలేదు. దానితో ఏమీ తోచకుండా అయింది. వెర్రెత్తినట్టనిపించింది.

కొంచెం స్తిమితం చిక్కించుకుని ఆలోచనలో పడ్డాడు. అతను కళోపాసి. సౌందర్యోపాసి. ప్రతి వస్తువులోనూ అతనికి ఏదో అందం, ఏదో నూతనత్వం గోచరిస్తూంటుంది. ఆ అందం తలుచుకున్నప్పుడల్లా ఆనందాన్నిస్తుంది.

అయినా అతను ఏ స్వాప్నిక జగత్తులోనో, ఏ భావకల్పితతరంగాల్లోనో సౌందర్యాన్ని సృష్టించుకుని ఆధ్యాత్మికమూ, అవ్యక్తమూ అయిన ఆనందంకోసం ఆరాటపడడు. అతని దృష్టిలో జీవితమే అందమయింది. నిత్యజీవితంలో ప్రతిచిన్నఘట్టమూ, ఆ ఘట్టంలోని ప్రతిచిన్నవిషయమూ అందంగానూ, ఆనందదాయకంగానూ ఉండాలి. అన్ని వస్తువులూ యింట్లో అందంగా అమర్చబడిఉండటం అతనికి యిష్టం. అతనలాగే చేస్తూంటాడు. ఏవస్తువు దాని స్థానాన్ని తప్పినా అతనికి అపరిమితమయిన కోపం. సహజంగా కోపస్వభావం కాకపోయినా అతి సున్నితమైన మనస్సవటంవల్ల తన భావాలకు విరుద్ధమైన ఏచిన్నపనినైనా అతను సహించలేడు. ఆ విషయంలో అతనికి ఓర్పు చాలా తక్కువ. అది ఒక లోపమే కావచ్చు.

మరి ఆమెకో — సహజంగా సోమరితనం కొంచెం అధికం. అందువల్ల అతని అభిప్రాయాలూ

భావాలూ అంటే ఆమె కెంతో గౌరవమే అయినా ఆచరణలోకి వచ్చేసరికి తదనుగుణంగా నడుచుకోలేక పోతున్నది. అదే అతను సహించలేనిది. బయట నలుగురిలో తిరుగుతూన్నప్పుడు ఎలాంటి కఠినహృదయులనైనా, ఎలాంటి క్లిష్టసన్నివేశాలనైనా ఒక్క చిరునవ్వుతో జయించగలిగే అతనికి యింట్లో యిలాంటి చిన్నవిషయాలుగూడా అత్యంత కోపకారణాలవుతూండటం శోచనీయమే. ఈ విరుద్ధప్రకృతుల మధ్య రాజీ కుదుర్చుకోటం అతనికి ఎంతో కష్టతరమై పోయింది.

3

ఆనాటి సాయంకాలం ఏదో పనిఉన్నవాడిలాగా త్వరత్వరగా క్రాపుదువ్వుకుని చెప్పులు తొడుక్కొని బజారుకు బయలుదేరాడు. ముఖంలోమాత్రం ఉత్సాహచిహ్నాలేమీ కనిపించటంలేదు. వీథిసమ్మం దాటి బయట అడుగుపెట్టేసరికి ఎదురుగా గోడమీద సినిమాకాగితం కనుపించింది. చాలా చక్కటి చిత్రం. ప్రఖ్యాతనటీనటులు నటిస్తున్నారు. దానిమీదినుంచి దృష్టి మరలించి ముందుకు సాగాడు. ముఖంలో ఎందుకో విషాదరేఖలు గోచరిస్తూన్నై. నడుస్తూన్నా అతని మనస్సెక్కడో ఉంది. చూపు లెక్కడో అర్థం లేకుండా శూన్యాన్ని ఛేదిస్తున్నై.

ఆమే, అతనూ కలిసి సినిమాకు వెళ్ళి ఎన్నేళ్ళయిందో? ఏం, యిప్పుడుమాత్రం ఎందుకు వెళ్ళగూడదు? ఆర్థికదుస్థితిమూలంగానా? కాదే. మరి వ్యవధి లేకనా? అదీకాదే. ఏమో, ఎందుకో, అతనికి దాని మీద మోజు తగ్గిపోయింది. ఆరోజులు మళ్ళీరావు. కాలచక్రపరిభ్రమణంలో ఆరోజులు మళ్ళీ పునరావృత్తమైనా ఆ నిర్మలయౌవనోత్తేజం తిరిగి ప్రాప్తించదు. ఆ శరద్రాత్రులు పునఃగోచరించినా నాటి ఆనందానుభూతులు తిరిగి నేడు లభించవు.

ఆలోచనామగ్నుడై అడుగులో అడుగులు వేస్తూ ఏదో యేనాడో పారవేసుకున్న వస్తువుకోసం వెతుకుతూన్నట్టుగా దిక్కులుచూస్తూ పిచ్చివాడిలాగా అతనెంతదూరం తిరిగాడో అతనికే తెలియదు.

ఇంకా సూర్యాస్తమయం కాలేదు. కాని సూర్యుడుమాత్రం కనిపించటం లేదు. అతను సిమెంటు గొడుగుక్రింద నిలుచున్న పోలీసువాడి ఎర్రటోపీకేసి శూన్యంగా చూస్తూ నిలుచున్నాడు. చూడగాచూడగా కండ్లు చెదిరి టోపీ రెండుగా కనుపించింది. మెల్లిగా కండ్ల అద్దాలు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకుని యిల్లు జ్ఞాపకం వచ్చి వెనక్కుతిరిగేసరికి ఎవరో భుజంమీద చెయ్యివేసిన ట్లనిపించింది. అత నాశ్చర్యచకితుడు కాలేదు. మెల్లిగా వెనుదిరిగిచూశాడు.

"ఏంరోయ్, యెంత మారిపోయినావురా! ఇందాకట్నుంచీ చూస్తూ నీవు అవునా కాదా అని సందేహిస్తున్నాను" అన్నాడు ఆ వచ్చిన యితని పాతస్నేహితుడు.

ఇతని ప్రాణం లేచివచ్చింది. తనను ఎవరయినా "ఏంరా" అని అంత ఆప్యాయంగా పిలువగా విని ఎంతకాలం అయిందో! కండ్లఅద్దాలు తుడుస్తూ సంతోషాన్ని ప్రకటించి నవ్వాలని ప్రయత్నం చేశాడు. నోరు నవ్వినా ఎప్పుడూ నక్షత్రాలలాగా మిలమిలా మెరిసే అతని కండ్లుమాత్రం నవ్వలేక వెలవెలపోయినై. కొంచెం నాలిగానవ్వి, "ఎప్పుడొచ్చావురా, అంతా బాగున్నారా?" అని పరామర్శించాడు మిత్రుణ్ణి.

"ఆ. మధ్యాహ్నం వచ్చాను. మీ యిల్లెక్కడో తెలిసిందికాదు. లేకపోతే అక్కడికే వచ్చేవాడిని. ఇక్కడే మాపినతండ్రికూతురుయింట్లో దిగాను."

"అలాగా. దా, వెళ్దాం రా, యింటికి; చూతువుగాని" అని మిత్రుణ్ణి ఆహ్వానించాడు.

ఇరువురూ యింటివైపు మళ్ళారు. ఇతన్ని చూస్తే పాపం మిత్రుడికి ఆశ్చర్యమూ, విచారమూ కూడా కలిగాయి. ఎలాంటివాడు ఎలా మారిపోయినాడు! పూర్వం వాళ్ళిద్దరూ కాలేజీలో కలిసి చదువుకొనేరోజుల్లో అత నెంత ఉత్సాహంగా ఉండేవాడు! ఎన్నో ఆశయాలతో, ఏవో మహత్తరాదర్శాల కోసం అర్రులు చాస్తూ ఏవేవో మనోహరస్వప్నాలు కంటుండేవాడు. శత్రువునుగూడా లోబరచుకొన

గలిగే అతని మధురవాక్చాతురీగరిమ అతని కెంతో మంది మిత్రులను సంపాదించిపెట్టింది. మరి యిప్పు డదంతా ఎక్కడ అణగారిపోయింది? ఇంత కొద్ది కాలంలో ఎందు కిలా తయారయినాడు? ఏమిటో, వీటన్నింటికీ కారణాలు కనుపించవు.

ఇల్లు సమీపించింది. అతను మెల్లిగా గేటు తీశాడు. అది కిర్రుమని సన్నగా ధ్వనిచేసింది.

"నాన్నా, నాన్నా! మరే, అమ్మే, కప్పూ, చాచలూ, పగలకొత్తింది నాన్నా" అని అతని రెండో కొడుకు మూడేళ్ల పిల్లవాడు పరుగెత్తుకుంటూ ఎదురుగా వచ్చి చెప్పాడు.

"ఊఁ. సరేలే. ఇవ్వాళ కొత్తేముంది? రోజూ యింటికొచ్చేసరికి యేదో ఒకటి తయారు." అని కొంచెం విసుక్కొని, పిల్లవాణ్ణి చెయ్యిపట్టుకొని లోపలికి తీసుకునివెళ్లి, స్నేహితుడికి ఒక కుర్చీ చూపించి, కూర్చోమని, తాను లోపలికి వెళ్లాడు.

"నాన్నా, యిదిగో చూలూ, యీముక్కలు చూలూ" అన్నాడు ఆ చంటివెధవ అంతటితో మానె య్యక అక్కడ పడివున్న పగిలిపోయిన పింగాణీ ముక్కలకేసి చూపిస్తూ.

"పోతేపోయింది; అవతల పారెయ్యక ఎందు కింకా ఉంచావ్, యింటినిండా అసహ్యంగా?"

అక్కడే కూర్చుని ఉంది ఆమె లైట్లు తుడుస్తూ.

"అబ్బ! అంత ఖరీదుగల వస్తువు పోతేపోయింది గాని అక్కడుంటే అసహ్యంగా ఉన్నాయని విసుగ్గా ఉందిగాబోలు!" అని విసిరింది ఆమె అతనిప్రశ్నకు సమాధానంగా.

"ఉండదా యేం? ఎవడు పగలగొట్టమన్నాడూ, ఎవడక్కడ పోగుచేసి దాచిపెట్టమన్నాడు?"

"ఒకరంటే పగలగొడ్తానా ఏమిటండీ, అల్లా అంటారూ? ఏదో ఖర్మంజాలక చేయి జారింది. నాకు మాత్రం అంత యిష్టమా యేం పగలగొట్టాలని?"

"ఇష్టమూ, గిష్టమూ ఏమీ అక్కరలేదు, కాస్త ఒళ్ళు దగ్గిర పెట్టుకుని తిరుగుతుంటేసరి. ఊరికే ఎందుకు పగులుతై, అంత తోలుచేతులా ఏం?"

"తోలుచేతులో బంగారపుచేతులో, ఏంచేస్తాం మరి? దేవుడిచ్చిన వవ్వీ."

"ఊఁ. సరేలే. ఇక చాలించు. మాటకుమాట జవాబు చెపుతుంటే సరి, కడుపునిండుతుంది." అని అతను దొడ్లోకి వెళ్ళాడు. ఆమె యింకా ఏమో అంటూనేఉంది. మాటకు మాట చేటు. అతను వినుపించు కోలేదు. ఈమాటలన్నీ తన స్నేహితు డెక్కడవిన్నాడో అని అతను తనలోతాను ఎంతో మథనపడ్డాడు. ఇంట్లో ఇల్లాంటివి జరుగుతూఉండటం రానురానూ అలవా టయిపోయింది. ఒక్కొక్కమాటు అతనికి ఒళ్ళు మండిపోతుంది. కాని పొరపాటునగూడా యింత వరకూ ఆమెమీద చేయిచేసుకోలేదు. ఎంత దారుణబడ బాగ్నినయినా తన చల్లనికడుపులో దాచుకొనగలిగిన రత్నాకరు డతను. కోపంవచ్చినప్పుడు నాలుగు బాది దాన్నంతా కుమ్మరించి మరుక్షణంలో ప్రేమాతిశయం చూపించేవా రెంతమంది లేరు? నిజంగా అలాఉన్నా బాగుంటుంది. ఆ కోపమూ, ఉద్రేకమూ అలా ఉపశ మించిపోతాయి. మరి అతను అల్లాంటివాడు కాడు. ఎంతతీవ్రమైన కోపాన్నైనా దిగమ్రింగివూరుకుంటాడు. అందుకే అంత బాధపడి ఆవేదనతో కుమిలిపోతాడు. అన్నిటికంటే ఎక్కువగా, తాము ఇల్లా చీటికీమాటికీ కలహించుకుంటూంటే ఎవరైనా వినిపోతారేమో అని లోలోపల బాధపడిపోతూంటాడు. అందుకనే తమ పోరాటం తీవ్రస్వరూపాన్ని తాల్చి క్రుతిమించినప్పుడు మెల్లిగా బయటికి జారుకుని తిరిగితిరిగి ఎప్పుడో యిల్లు చేరుకుంటాడు.

ఇప్పుడు తమ యిరువురిమధ్యనా జరిగిన సంభా షణను తనమిత్రుడు విన్నాడేమో ననే భయంతో కొంచెంసేపు దొడ్లో తారట్లాడి మెల్లగా లోపలికి చేరు కున్నాడు.

మిత్రుడు, పాపం, అతని వైపు జాలిగా చూసి లేస్తూ, "వస్తానురా. చీకటిపడుతోంది. మళ్లీ రేపు కలుసుకుంటాను." అన్నాడు.

అతనేమీ మాట్లాడలేకపోయినాడు. ఏదో తప్పుచేసినవాడిలాగా మిత్రుడి వెనకాల మెల్లగా అడుగులు వేస్తూ బయటికివచ్చాడు.

"ఏంరా, ఏవైనా కొత్తబొమ్మలు వేశావా? మళ్లీ పద్యాలేమైనా రాశావా? అంతటితోటే స్వస్తి చెప్పావా?" అని చిరునవ్వుతో ప్రశ్నించాడు మిత్రుడు.

"ఆఁ. ఏమోరా. ఏమి చెప్పటానికీ సిగ్గుగా ఉంది. సంసారం నెత్తినపడి పెరుగుతూన్న కొద్దీ యిలాంటివాటి కేమీ ఆస్కారం లభించేట్టు కనుపించటంలేదు" దీనంగా జవాబుచెప్పాడు.

మిత్రుడి కేమిటో అంతా అర్థమైనట్లయింది.

"నిజమే. ఇలా ఎందుకు జరుగుతూంటుందీ అంటే మనం సరియైన జవాబు చెప్పలేం. సంసారంలో పడి ఎంతమంది తమ ఆశయాలకు యిలా స్వస్తి చెపుతూంటారో మనం ఊహించలేము. అయినా అటు లౌకికవిచారాల్లో మునిగి వీటిని బుద్ధిపూర్వకంగా వదులుకుంటారు అని అంటానికి వీల్లేదు. పోనుపోనూ బాధ్యతలూ, బాధలూ, బంధనాలూ ఎక్కువై సంతోషం తగ్గిపోయి నిరుత్సాహంగా జీవితాన్ని యంత్రంలాగా లాగే స్థితిలోకి వచ్చినప్పుడు మానవుడి ఆశయాలూ, ఆశలూ క్రమంగా వాటంతట అవే సమసిపోతా యన్నమాట. అంతే. వాటిని స్వయంగా వదలుకోవటం అంటూ ఉండదు. అయినా ఫరవా లేదులే. నిరుత్సాహపడ్తే ఎలా నీలాంటివాడు? ఎప్పుడూ యిల్లాగే ఉంటామా? భవిష్యత్తెంత ఫలవంతమో మన కేం తెలుస్తుంది." అని ముగించాడు.

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా గడిచింది.

"సరే, వస్తానురా" అని మిత్రుడు కదిలాడు.

ఇతను ఆలోచనలో పడి ఆలాగే నిల్చున్నాడు. తన స్నేహితుడు చెప్పినదాంట్లో ఎంతయినా పరమార్థం ఉంది. అదంతా మూర్తీభవించి కండ్లఎదుట గోచరించినట్లయింది. ఇంక అక్కడ నిల్చోలేకపోయినాడు. కండ్లు చీకట్లుక్రమ్మినై. బయట కూడా అంతా అంధకారం ఆవరించిపోయింది. ఆ అంధతమసంలో అతని కేదో ఆశాకిరణం తళుక్కున మెరిసి విరిసినట్లనిపించింది. ఒక దీర్ఘనిశ్వాసం అతని హృదయకుహరంనుండి వెలువడి ఆ అంధకారంలో కలిసిపోయింది. అది చాలు. ఆ ఆశతో యింకా వెయ్యేండ్లు జీవించగలననే ధైర్యం కలిగింది అతనికి.

"ఎప్పటికైనా మంచిరోజులు రాకపోతాయా?"

మళ్ళీ గేటుతలుపు కిఱ్ఱుమంది. అతను ఉత్సాహంతో లోపలికివెళ్ళి బీరువాతలుపు తీశాడు. అందులో కలాలూ, కుంచెలూ, రంగులూ సచేతనంగా, సవిలాసంగా అతని కండ్లఎదుట సాక్షాత్కరించినై. వెనుక తాను చిత్రించిన చిత్రాలూ, వ్రాసిన పద్యాలూ స్ఫురణకువచ్చి శరీరం పుల్కరించింది. వెంటనే ఒక కాగితమూ, పెన్సిలూ తీసుకుని లైటు పెద్దదిచేసి ఒక చిత్రం ప్రారంభించాడు. ఒక అరగంటసేపు బాహ్యప్రపంచ స్థితిని విస్మరించి చిత్రం పూర్తిచేసి క్రింద ఆ చిత్రగతభావానుగుణంగా ఒక పద్యం వ్రాసి పైన 'ఆశాకిరణం' అని వ్రాశాడు. కాని ఏమిటో వెనుకటి చిత్రాలలోని కళావిశిష్టత దీనిలో కనుపించటంలేదు. విస్మృతకళాజీవితానికి ఛాయామాత్రాలైన కొన్ని చిహ్నాలుమాత్రం అందులో స్ఫురిస్తున్నాయి.

అతను దాన్ని తిరిగి బీరువాలో భద్రపఱచి తలుపువేసి ఎంతో భారంగా మరో నిట్టూర్పు విడిచి మెల్లిగావెళ్ళి అక్కడే ఉన్న పడకకుర్చీలో మేను వాల్చాడు. ఆ రాత్రి హైమఱచి నిద్రించాడు.

తెల్లవారితే మళ్లీ మామూలేగా! అబ్బ, ఆ స్నేహితుడు మళ్లీ ఎప్పుడు వస్తాడో!